ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
శుక్రవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 30.5 । కనిష్ఠం 19.6
కామారెడ్డి
జిల్లా వార్తలు
5
శనివారం 31 ఆగస్టు 2024



రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి : ఎస్పీ

సదాశివనగర్, ఆగస్టు 30: రోడ్డు ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ సింధూశర్మ తెలిపారు. శుక్రవారం సదాశివనగర్ పోలీసుస్టేషన్‌ను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. పోలీసుస్టేషన్‌లో నమోదైన కేసుల వివరాలను రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం ప్రజా సమస్యలపైన వెంటనే స్పందిస్తూ బాధితులకు సత్వర న్యాయం జరిగే విధంగా భరోసా కల్పించాలని, బాధితులకు ఏదైన సమస్య ఉంటే వెంటనే పోలీసుస్టేషన్‌ని సంప్రదించాలన్నారు. గణేష్ వేడుకల్లో డీజే ఏర్పాటుకు అనుమతి లేదని మండపం నిర్వాహకులు, కమిటీలకు అధికారులు వివరించి చెప్పాలని తెలిపారు.

కాసుల కోసం కక్కుర్తి



తప్పుడు రిపోర్టు ఇచ్చిన ల్యాబ్ ఇదే..

డెంగీ లేకున్నా ఉన్నట్లు రిపోర్టు

- జిల్లాలో కొన్ని డయాగ్నోస్టిక్ సెంటర్లలో తప్పుడు రిపోర్టులు
- చిన్నపాటి జ్వరాలకు పరీక్షల పేరుతో వేలాది రూపాయల దోపిడీ
- డెంగీ లేకున్నా ఉన్నట్టు రిపోర్టులు
- కమీషన్ల కోసం పరీక్షలకు రాస్తున్న వైద్యులు
- వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు బాధితుల ఫిర్యాదు
- ఫిర్యాదుతో డయాగ్నోస్టిక్ సెంటర్‌కు అనుమతి లేదనే విషయం బట్టబయలు
- జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యేక డ్రైవ్ చేపడితేనే దోపిడీకి అడ్డుకట్ట

కామరెడ్డి టౌన్, ఆగస్టు 30: సీజనల్ వ్యాధులు వస్తే చాలు కొందరు డయాగ్నోస్టిక్ సెంటర్లకు పండగల మారుతోంది. కాసుల కోసం రోగం లేకున్నా రోగాన్ని అంటకట్టి ప్రస్తుత పరిస్థితిని క్యాష్ చేసుకుంటున్నారు. ప్రస్తుతం జిల్లాలో ఎక్కడ చూసినా డెంగీ, మలేరియా, వైరల్ జ్వరాలు విస్తృతంగా వ్యాపిస్తున్నాయి. ఏ గ్రామంలో చూసినా వీరి సంఖ్య అధికంగానే ఉంటుంది. వైరల్, డెంగీ ఫీవర్లతో ప్లేట్‌లెట్స్ తగ్గి ప్రాణాల మీదకు వస్తుండడంతో రోగులు డాక్టర్‌లను ఆశ్రయిస్తున్నారు. దీంతో కమీషన్ల కోసం కక్కుర్తి పడుతున్న కొందరు డాక్టర్లు రోగులను కమీషన్‌లు ఎవరు ఎక్కువ ఇస్తే వారికి రిఫర్ చేస్తున్నారు. చిన్నపాటి జ్వరంతో బాధపడుతూ డాక్టర్ దగ్గరకు వెళ్లితే చాలు నాడి పట్టకుండానే బీపీ, షుగర్, మూత్ర పరీక్ష, డెంగీ మలేరియా లాంటి పరీక్షలు చేయించుకొని రావాలని సూచిస్తున్నారు. డాక్టర్ చెప్పాడు కదా అని లాబోరేటరీలకు వెళ్లితే 100 నుంచి 200 అవుతాయి అనుకుంటే చిన్న ఆసుపత్రులయితే పరీక్షలు చేసి రూ.1000 నుంచి రూ.2000ల వరకు పెద్ద ఆసుపత్రులయితే రూ.5వేల కు పైనే బిల్లు చేతిలో పెడితే కాని రిపోర్ట్‌లు ఇవ్వడం లేదు. పరీక్షలు చేసి తీసుకున్న డబ్బులకు బిల్లులు కూడా ఇవ్వడం లేదు. ఇదిలా ఉంటే అసలు అనుమతి లేకుండానే డయాగ్నోస్టిక్ సెంటర్‌లు, ఆసుపత్రులు ఏర్పాటు చేస్తున్నారంటే ఏ స్థాయిలో దందా సాగిస్తున్నారో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఏ విధమైన పర్యవేక్షణ చేస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. డెంగీ లేకున్నా డెంగీ పాజిటివ్ అని రిపోర్టులు ఇస్తుండడం గమనార్హం. ఎప్పటి నుంచో ఈ తరహా దందా కొనసాగుతున్నా అధికారుల పర్యవేక్షణ అంతంతా మాత్రంగానే ఉండడంతో అర్హతలేనివారు పరీక్షలు చేసి రిపోర్టులు ప్రజల చేతులో పెడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ప్రత్యేక డ్రైవ్ చేపడితే విచ్చలవిడి దోపిడీ, అర్హతలేని వారి డయాగ్నోస్టిక్ సెంటర్ల నిర్వహణ బట్టబయలు అయ్యే అవకాశాలు ఉన్నాయి.

ప్రస్తుతం పల్లెల్లో, పట్టణాల్లో పారిశుధ్య లోపంతో ఎక్కువ శాతం డెంగీ కేసులు నమోదవుతున్నాయి. ప్రజలు జ్వరం వస్తే చాలు ఆసుపత్రులకు పరుగులు పెడుతున్న పరిస్థితులు నెలకొంటున్నాయి. ఇదే అదనుగా భావిస్తున్న పలు ప్రైవేట్ ఆసుపత్రులు చిన్నపాటి రూమ్‌లు ఏర్పాట్లు చేయించి అర్హతలేని వారితో పరీక్షలు చేయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈనెల 27న సదాశివనగర్ మండలం తిర్మన్‌పల్లికి చెంది న ఆరె మధుసూదన్‌రావు తన కూతురుకు జ్వరం రావడంతో కామారెడ్డి జిల్లా కేంద్రంలోని బాలుర పాఠశాలకు వెళ్లే దారిలో ఉన్న లక్ష్మీనరసింహ పిల్లల ఆసుపత్రికి తీసుకువచ్చాడు. దీంతో డెంగీ పరీక్ష చేయించాలని వైద్యుడు సూచించడంతో ఆసుపత్రి ఎదురుగా ఉన్న అపోలో డయాగ్నోస్టిక్ సెంటర్‌కు వెళ్లి మధుసూదన్‌రావు తన కూతురుకు డెంగీ పరీక్షలు చేయించాడు. అందులో డెంగీ పాజిటివ్ అని రిపోర్టు ఇవ్వడంతో వైద్యుడు మరో ఆసుపత్రిలో చేరాలని సూచించాడు. మరో ఆసుపత్రిలో ఎందుకు చేరమంటున్నాడని అనుమానం వచ్చిన మధుసూదన్‌రావు మరో ప్రైవేట్ ల్యాబ్‌లో డెంగీ పరీక్ష చేయించగా డెంగీ నెగిటివ్‌గా వచ్చింది. మరుసటి రోజు సదాశివనగర్ పీహెచ్‌సీలోని ప్రభుత్వ వైద్యులకు తన కూతురుని చూపించగా అక్కడి వైద్యులు టీహబ్‌కు పరీక్షల నిమిత్తం పంపారు. అక్కడ ఆయన కూతురుకు డెంగీ నెగిటివ్ అని వచ్చింది. దీంతో ఆసుపత్రి వద్ద ఉన్న డయాగ్నస్టిక్ సెంటర్ నిర్వాహకుడు తమకు తప్పుడు రిపోర్టు అంటకట్టారని వాపోయి డయాగ్నస్టిక్ నిర్వాహకుడిపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కార్యాలయంలో ఫిర్యాదు చేశాడు.

అర్హత లేని వారితో సెంటర్ల నిర్వహణ

ఎంతో కొంత వైద్య పరిజ్ఞానం ఉంటే చాలు ఆయా విభాగాలకు సంబంధించి పట్టాలు లేకున్నా డయాగ్నోస్టిక్ సెంటర్‌లను జిల్లా కేంద్రంతో పాటు మండల కేంద్రాల్లో విచ్చలవిడిగా ఏర్పాటు చేస్తున్నారు. పాథోలజిస్టులు, మైక్రో బయాలజిస్ట్‌లు లేకుండానే వైరల్ ఫీవర్‌లకు సంబంధించిన పరీక్షలు చేస్తూ డయాగ్నోస్టిక్ సెంటర్లు నిర్వహిస్తుండడం, పాథోలజిస్టుల సర్టిఫికెట్లతో డయాగ్నోస్టిక్ సెంటర్‌లు కొనసాగుస్తుండడంతో గతంలోను రక్త గ్రూప్‌లో తేడాలు వచ్చిన సంఘటనలు ఉన్నాయి. గతంలోనూ కామారెడ్డి జిల్లా కేంద్రంలోని గోదాంరోడ్డులో ఇదే తరహాలో ఓ వ్యక్తి పరీక్షలు నిర్వహించుకునేందుకు రాగా ఓ

ఫిర్యాదు ఆధారంగా విచారణ చేసి చర్యలు తీసుకుంటాం


• చంద్రశేఖర్‌రావు, డీఎంహెచ్‌వో, కామారెడ్డి

జిల్లా కేంద్రంలోని బాలుర పాఠశాల వెళ్లే దారిలో ఉన్న అపోలో డయాగ్నస్టిక్ సెంటర్‌లో తప్పుడు రిపోర్టు ఇచ్చారని బాధితులు ఫిర్యాదుచేశారు. అసలు ఏ విధంగా డెంగీ పాజిటివ్ అని ఇచ్చారనే విషయంపై పూర్తి విచారణ చేసి తగిన చర్యలు తీసుకుంటాం. ఇష్టారీతిన తప్పుడు రిపోర్టులు ఇస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం.

సారి బీ పాజిటివ్ అని మరోసారి ఓ పాజిటివ్ అని రిపోర్టులు అందించారు. మరికొన్ని చోట్ల గర్భిణులకు ఉమ్మనీరు తగ్గకున్నా తగ్గినట్లు రిపోర్టులు ఇస్తున్నారని పలువురు వైద్యులే పేర్కొంటుండడం గమనార్హం. తిర్మన్‌పల్లికి చెందిన మధుసూదన్‌రావు కూతురుకు డెంగీ పాజిటివ్ లేకున్నా పాజిటివ్‌గా ఇచ్చిన డయాగ్నోస్టిక్ సెంటర్‌కు అసలు అనుమతి లేదని ఇచ్చిన రిపోర్టు సైతం ఆ డయాగ్నస్టిక్ సెంటర్ పేరుపై లేదని మరో సెంటర్ పేరు మీద ఉందని బాధితులు పేర్కొంటున్నారు. అర్హత లేని వ్యక్తులు పరీక్షలు నిర్వహించి పాజిటివ్ రిపోర్టులు ఇస్తుండడం, దాని అదునుగా చేసుకుని పలువురు ప్రైవేట్ ఆసుపత్రుల వైద్యులు రూ.లక్షలు వసూలు చేస్తుండడంపై తీవ్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.



మధుసూదన్‌రావు కూతురుకు ప్రైవేటు డయాగ్నోస్టిక్‌లో డెంగీ పాజిటివ్ తప్పుడు రిపోర్టు



ప్రభుత్వ టీ హబ్‌లో డెంగీ నెగెటివ్ రిపోర్టు

చేసిన పరీక్షలకు బిల్లు ఉండదు.. ఎంత డిమాండ్ చేస్తే అంత సమర్పించాలి

ఏ డయాగ్నస్టిక్ సెంటర్లలో ఏ వైద్య పరీక్షకు ఎంత ఫీజు వసూలు చేస్తున్నారో తెలిపే బోర్డు ఉండాలి. కానీ చాలా డయాగ్నస్టిక్ సెంటర్‌లలో అసలు బోర్డులనేవి ఉండడం లేదు. దీనివల్ల వారు ఎంత డిమాండ్ చేస్తే అంత ఇవ్వవలసి వస్తుందని ప్రజలు వాపోతున్నారు. డయాగ్నస్టిక్ సెంటర్లు చేస్తున్న దోపిడీని ప్రజలు అధికా రులకు తెలియజేస్తున్న లిఖిత పూర్వకంగా ఇస్తేనే చర్యలు తీసుకుంటామని పేర్కొంటున్నారే తప్ప వాటిపై కనీస నిఘా పెట్టడం లేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. జిల్లాలో ఉన్న కొన్ని లేబరేటరీల్లో పట్టా ఉన్నవారు కూడా కానరావడం లేదు. నిబంధన ప్రకారం యూరిన్ కల్చర్, బ్లడ్ కల్చర్, ప్లేట్‌లెట్ కౌంట్ వంటి పరీక్షలు చేయవలసిన పాథోలజిస్టులు, మైక్రో బయోలజిస్ట్‌లు, ఎల్‌టీలు చాలా డయాగ్నిస్టిక్ సెంటర్లలో లేరు. అరువుకు తెచ్చిన సర్టిఫికేట్లతో కొద్దిరోజులు పదో తరగతి, ఇంటర్ చదివి ల్యాబ్‌లలో పనిచేసి కొద్దిమేర ఉన్న అవగాహన ఉంటే చాలు డయాగ్నస్టిక్ సెంటర్‌లు ఏర్పాట్లు చేసి పరీక్ష రిపోర్టులు ఇస్తున్నారనేది జగమెరిగిన సత్యం. అసలు డెంగీ నిర్ధారణ చేయాలంటే టీ హబ్‌కు మాత్రమే పంపాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు చెబుతున్నా కొందరు తమను ఎవరూ పట్టించుకుంటారని వారికి తోచిన విధంగా రిపోర్టులు అందిస్తున్నారు.

ప్రత్యేక డ్రైవ్ చేపడితేనే దోపిడీకి అడ్డుకట్ట

రిజిస్ట్రేషన్ లేకుండానే వందల వరకు జిల్లాలో డయాగ్నస్టిక్ సెంటర్‌లు నిర్వహిస్తున్నట్లు సమాచారం. ముఖ్యంగా వైరల్ జ్వరాలు వ్యాప్తి అధికంగా ఉండటం వీరికి కలివస్తోంది. జ్వరం రాగానే తమకు ఏమైందోనని భయంతో రోగులు డయాగ్నస్టిక్ సెంటర్లకు పరుగులు తీస్తుండడంతో ఇదే అదనుగా వారు దోచేసుకుంటున్నారు. తనిఖీలు చేపట్టాల్సిన వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఫిర్యాదు వస్తేనే కదులుతామని చెబుతుండడ గమనార్హం. ఇంటర్ కూడా పాస్ కాని వ్యక్తులు సైతం పరీక్షలు నిర్వహిస్తున్నారు. వారు చేసిన రిపోర్టులను చూసి డాక్టర్లు రోగులకు సమాధానాలు చెబుతున్నారు. మరికొన్నిచోట్ల రోగులకు వ్యాధుల లక్షణాలు ఉండడం రిపోర్టులలో ఎలాంటి ఇబ్బంది లేదని సూచిస్తుండడంతో వైద్యులు మరో డయాగ్నస్టిక్ సెంటర్‌లకు రిఫర్ చేస్తున్నారు. దీంతో డబుల్ ఖర్చులతో పాటు మొదటి రిపోర్టుకి మరో రిపోర్టుకి తేడాలు వస్తుండడం పట్ల ప్రజలు పెదవి విరుస్తున్నారు. అసలు డయాగ్నస్టిక్ సెంటర్‌లపై జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారుల తనిఖీలు కరువయ్యాయని వాదనలు లేకపోలేదు. ఇప్పటికే పీఎంపీ, ఆర్‌ఎంపీల విచ్చలవిడి వైద్యంపై వైద్యఆరోగ్యశాఖ అధికారులు తనిఖీలు చేపడుతూ నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వాటిని సీజ్ చేస్తున్నారు. ఇదే తరహాలో డయాగ్నస్టిక్ సెంటర్లపై ప్రత్యేక డ్రైవ్ చేపడితే ప్రజలకు కాసుల కోసం తప్పుడు రిపోర్టులు ఇస్తున్న వారి బండారం బయటపడే అవకాశం ఉంది.

వచ్చే ఏడాది నాటికి లెండి నీరు



నిలిచిపోయిన లెండి ప్రాజెక్టు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మీకాంత్‌రావు

జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంత్‌రావు హామీ

మద్నూర్, ఆగస్టు 30: ఎటువంటి నీటి వనరులు లేని మద్నూర్, బిచ్కుంద మండలాలకు అవసరమైన నీటిని లెండి ప్రాజెక్టు ద్వారా వస్తాయని అవసరమైన నీటిని లెండి ప్రాజెక్టు ద్వారా వస్తాయని గతంలో ఉమ్మడి రాష్ట్రాల ఆధ్వర్యంలో లెండి ప్రాజెక్టు నిర్మాణం పనులను ప్రారంభించారు. ఆ పనులు అర్ధాంతరంగా నిలిచిపోవడంతో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు శుక్రవారం తెలంగాణ ఇరిగేషన్ అధికారులతో కలిసి లెండి ప్రాజెక్టును పరిశీలించారు. ప్రాజెక్టు పనులు పరిశీలించిన అనంతరం వివరాలను అధికారులతో అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ 35 సంవత్సరాల క్రితం ప్రారంభించిన లెండి ప్రాజెక్టు పనులు నత్తనడకన కొనసాగుతున్నాయని పనుల పురోభివృద్ధి కోసం తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గత పది సంవత్సరాల్లో టీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రాజెక్టును గాలికి వదిలేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. మహారాష్ట్రలో నిర్మిస్తున్న లెండి ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే జుక్కల్ నియోజకవర్గంలోని మద్నూర్, బిచ్కుంద, జుక్కల్ మండలాల్లో దాదాపు 22 నుంచి 25 వేల ఎకరాలకు సాగు నీరు అందుతుందని సూచించారు. ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వం మహారాష్ట్ర ప్రభుత్వంతో ప్రాజెక్టు నిర్మాణంపై చర్చలు జరుపుతుందని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్‌రెడ్డి ప్రాజెక్టు పూర్తి చేసేందుకు దృఢ సంకల్పంతో ఉన్నారని తెలిపారు. అంతర్రాష్ట జల సమస్యల పరిష్కారానికి ఉన్నత కమిటీని ఏర్పాటు చేసి త్వరగా ప్రాజెక్టు నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు చేపడతామని అన్నారు. ఈ పాటికి తెలంగాణలో ప్రాజెక్టుకు కావాల్సిన భూసేకరణ ప్రక్రియ పూర్తయిందని రైతులకు నష్ట పరిహారం సైతం అందజేయడం జరిగిందని తెలిపారు. వచ్చే ఏడాది నాటికి లెండి ప్రాజెక్టు నీరు ముప్పై ఐదు శాతం తెలంగాణకు వచ్చే విధంగా కృషి చేస్తానని అన్నారు. ఆయనతో పాటు తెలంగాణ ఇరిగేషన్ అధికారులు జుక్కల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు.

సబ్ కలెక్టర్‌గా కిరణ్మయి బాధ్యతల స్వీకరణ

బాన్సువాడ టౌన్, ఆగస్టు 30: బాన్సువాడ సబ్ కలెక్టర్‌గా 2022 బ్యాచ్‌కు చెందిన కిరణ్మయిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు శుక్రవారం ఆమె బాన్సువాడ డివిజన్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రమేష్ రాథోడ్, తహసీల్దార్ వరప్రసాద్, సిబ్బంది తదితరులున్నారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న కిరణ్మయి

శ్రీవారిని దర్శించుకున్న సబ్ కలెక్టర్

బీర్కూర్: తిమ్మాపూర్ గ్రామ సమీపంలోని తెలంగాణ తిరుమల దేవస్థానంలో కొలువు దీరిన వేంకటేశ్వర స్వామి, అమ్మవార్లను శుక్రవారం బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ పూజారులు ఆమెను పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆమె స్వామి వారికి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇదిలా ఉండగా ఆలయ కమిటీ సభ్యులు సబ్ కలెక్టర్ దంపతులకు శాలువాతో ఘనంగా సన్మానించారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి టౌన్, ఆగస్టు 30: రోగులకు మెరుగైన వైద్యం అందించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ వైద్యులను ఆదేశించారు. కామారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని శుక్రవారం కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పరిశీలించారు. జిల్లా వైరల్ ఫీవర్ కేసులు, డెంగీ జ్వరాలు పెరుగుతున్నందున జిల్లా ఆసుపత్రిలో అందుతున్న వైద్యసేవల గురించి ఆరా తీశారు. ఆసుపత్రిలోని అన్ని వార్డులను తిరిగి ఇన్‌పేషంట్, అడ్మిట్ అయిన రోగులతో మాట్లాడి వారికి అందుతున్న సేవలను తెలుసుకున్నారు. జ్వరం కేసుల తీవ్రత దృష్ట్యా జిల్లా ఆసుపత్రిలో మెరుగైన సేవలు అందించాలని, వైద్యులు సకాలంలో స్పందించాలని తెలిపారు. ఆసుపత్రిలో మందుల కొరతను వైద్యులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా వెంటనే వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్‌తో మాట్లాడి తగు ఏర్పాటు చేస్తానని తెలిపారు. వైద్యుల కొరత లేకుండా నియామక ప్రక్రియ చేపట్టాలని తెలిపారు. జిల్లాలోని ఏయే మండలాల నుంచి ఎక్కువ జ్వరం కేసులు వస్తున్నాయనే దానిపై ఆరా తీసి తగిన చర్యలు చేపట్టాలని డీఎంహెచ్‌వో చంద్రశేఖర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ రాంసింగ్, ఆర్‌ఎంవో శ్రీనివాస్, వైద్యుడు వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారితో మాట్లాడుతున్న కలెక్టర్

కలెక్టర్‌ను కలిసిన సబ్ కలెక్టర్

బాన్సువాడ సబ్ కలెక్టర్‌గా నియామకమైన కిరణ్మయి శుక్రవారం కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకేను అందించారు.



కొత్త రేషన్ కార్డులకు మోక్షం

- కొత్త కార్డుల మంజూరుకు ప్రభుత్వం కసరత్తు
- వచ్చే నెల 17 నుంచి రేషన్‌కార్డుల దరఖాస్తుల స్వీకరణ
- జిల్లాలో ఏళ్లుగా ఎదురుచూస్తున్న ప్రజలు
- సంక్షేమ పథకాలకు దూరమవుతున్నామని ఆవేదన
- జిల్లాలో రేషన్‌కార్డులు 53 శాతం కుటుంబాలకే పరిమితం

కామారెడ్డి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అర్హులైన అనేక మంది రేషన్‌కార్డుల కోసం వెయ్యి కళ్లతో ఎదురుచూస్తున్నారు. రాష్ట్రంలో కొత్త రేషన్ కార్డుల మంజూరుకు రాష్ట్ర క్యాబినెట్ ఇది వరకే ఆమోదం తెలుపడంతో పాటు సబ్ కమిటీని ఏర్పాటు చేసింది. ఇటీవల సబ్ కమిటీ సమావేశమై పలు విధి విధానాలను రూపొందించి రేషన్‌కార్డుల కోసం గ్రామాల్లో అయితే వార్షికాదాయం రూ.లక్షన్నర, పట్టణ ప్రాంతాల ప్రజలైతే వార్షిక ఆదాయం 2లక్షల లోపు ఉన్నవారైతే అర్హులుగా తీసుకోవాలని కమిటీ ప్రతిపాదించింది. అయితే కొత్త రేషన్‌కార్డులకు దరఖాస్తులు వచ్చే నెల 17 నుంచి తీసుకునేందుకు ప్రజాపాలన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసేందుకు కసరత్తు చేస్తోంది. ఇది వరకే రేషన్‌కార్డులకు దరఖాస్తులు తీసుకోవడంతో పాటు మార్పులు, చేర్పులకు సైతం దరఖాస్తులు స్వీకరించడంతో పాటు మార్పులు, చేర్పులను సైతం చేస్తున్నారు. వాటితో పాటు కొత్తగా దరఖాస్తులు స్వీకరించనున్న నేపథ్యంలో కార్డుల కోసం నిరీక్షిస్తున్న వారిలో ఆశలు చిగురిస్తున్నాయి.

ఏళ్లుగా ఎదురుచూస్తున్న ప్రజలు

జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, జుక్కల్, బాన్సువాడ నియోజకవర్గాల పరిధిలో సుమారు 21,85,539 కుటుంబాలు ఉన్నాయి. ఇందులో సుమారు రేషన్‌కార్డులు లేని దారిద్రరేఖకు దిగువన ఉన్న లక్షకు పైగానే ఉంటాయని అధికార వర్గాలు చెబుతున్నాయి. ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీ స్కీంలకు రేషన్‌కార్డే ప్రామాణికంగా తీసుకుంటున్నందున సదరు కుటుంబాలు ఆందోళన చెందుతున్నాయి. ప్రస్తుతం జిల్లాలో 2,53,305 తెల్లరేషన్‌కార్డులు కలిగి ఉన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం గ్యారెంటీ సంక్షేమ పథకాలకు రేషన్‌కార్డు తప్పనిసరిగా ప్రకటించడంతో తెల్లరేషన్ కార్డుకు మరింత డిమాండ్ పెరిగింది. కొత్త రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తే భారీగా వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. అందులో భాగంగా ఇటీవల వచ్చే నెల 17నుంచి ప్రభుత్వం కొత్త రేషన్‌కార్డుల దరఖాస్తుల స్వీకరణకు ప్రజాపాలన ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టింది.

అరకొరగానే రేషన్‌కార్డుల జారీ

గతంలో తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత 2016లో కొత్త రేషన్‌కార్డులు మంజూరు చేసింది. అరకొరగానే కార్డులను జారీ చేసింది. అప్పటి నుంచి దరఖాస్తులు చేసుకున్న వారికి ఇంకా జారీ చేయలేదు. కొత్త రేషన్‌కార్డుల కోసం జిల్లాలో 40,042 దరఖాస్తులు వచ్చాయి. వాటిని క్షేత్రస్థాయిలో తహసీల్దార్‌లు విచారణ చేపట్టారు. దాదాపు 4200ల మంది అర్హులుగా తేల్చినట్లు అధికారులు చెబుతున్నారు. వివరాలు పౌర సరఫరాల శాఖాధికారులు ప్రభుత్వానికి నివేదించారు. విచారణ సమయంలో కొత్త కార్డులు వస్తాయని చాలా మంది దరఖాస్తుదారులు ఆశపడ్డారు. కానీ ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాకపోవడంతో కార్డుల కోసం సంవత్సరాల తరబడి నిరీక్షిస్తున్నారు. అదేవిధంగా కుటుంబంలో తమ పిల్లలకు వివాహాలు జరిగి కోడళ్ల పేర్లను, వారికి జన్మించే పిల్లల పేర్లను కార్డులో చేర్చేందుకు కూడా ప్రభుత్వం అవకాశం ఇవ్వ లేదు. రేషన్‌కార్డుల్లో పేర్లు కలిగి ఉన్న వారిలో ఎవరైన మరణిస్తే వారి పేర్లను తొలగించేందుకు మాత్రం అవకాశం కల్పించింది.

'ఆర్‌ఎంపీలు పరిధి దాటి చికిత్స చేయొద్దు'

దోమకొండ, ఆగస్టు30: ఆర్‌ఎంపీలు పరిధి దాటి చికిత్స చేయవద్దని వైద్యాధికారి భానుప్రియ అన్నారు. మండల కేంద్రంలోని మెడికల్ షాప్‌లు, ఆర్‌ఎంపీల ప్రాక్టీస్ సెంటర్‌లను ఎంపీడీవో ప్రవీణ్ కుమార్‌తో కలిసి శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్‌ఎంపీలు వివిధ గ్రామాల్లో తమ పరిధిలోని ప్రథమ చికిత్సలు అందించాలని, పరిధి దాటి చికిత్సలు చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

హెల్మెట్‌ను తప్పనిసరిగా ధరించాలి

భీమ్‌గల్, ఆగస్టు 30: ద్విచక్రవాహనదారులు హెల్మెట్‌ను ధరించి ప్రాణాలు సురక్షితంగా ఉంచుకోవాలని భీమ్‌గల్ సీఐ నవీన్‌కుమార్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని బడాభీమ్‌గల్ చౌరస్తా వద్ద యువకులకు, వాహనదారులకు హెల్మెట్ ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. మైనర్లు వాహనాలు నడిపితే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సై మహేష్, ఎఎస్సై చిరంజీవి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులను ప్రదానం చేస్తున్న అగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్

క్రీడలకు ప్రభుత్వ ప్రోత్సాహం

● అగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్


బాన్సువాడటౌన్, ఆగస్టు 30: గ్రామీణప్రాంత క్రీడాకారులకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని, క్రీడల్లో క్రీడాకారులు తమ సత్తాను చాటాలని రాష్ట్ర అగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రొ.జయశంకర్ క్రీడా మైదానంలో నిర్వహించిన బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీఒక్కరు చదువుతోపాటు క్రీడలలో కూడా రాణించి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, మండల విద్యాధికారి నాగేశ్వరరావు, దుద్దాల అంజిరెడ్డి, గోపాల్‌రెడ్డి, పిట్ల శ్రీధర్, నార్ల ఉదయ్, వెంకటేశ్, కిరణ్, నర్సింగ్‌రావు తక్కెడపల్లి, బాబా, ఖాలేక్, హకీం తదితరులున్నారు.

రుణమాఫీ కోసం కుటుంబ సభ్యుల నిర్ధారణ పక్కాగా చేపట్టాలి

సదాశివనగర్, ఆగస్టు 30: రుణమాఫీ కోసం రేషన్‌కార్డులేని వారి కుటుంబ సభ్యుల వివరాలను పక్కాగా చేపట్టాలని జిల్లా వ్యవసాయా అధికారి తిరుమల ప్రసాద్ అన్నారు. మండల కేంద్రంలో వ్యవసాయాధికారి ప్రజాపతి కుటుంబసభ్యుల నిర్ధారణ కార్యక్రమాన్ని చేపడుతున్న సందర్భంగా డీఏఓ ఆకస్మిక తనిఖీచేశారు. కార్యక్రమంలో ఏఈవో కవిత ఉన్నారు.

రుణమాఫీ కాని రైతుల వివరాల సేకరణ

బిచ్కుంద: రాష్ట్రప్రభుత్వం రైతులకు ప్రకటించిన రెండు లక్షల రుణమాఫీ మూడువిడుతలలో రాని రైతుల వివరాలను మండల వ్యవసాయాధికారి సేకరించారు. శుక్రవారం మండల కేంద్రంలోని కెనరా బ్యాంక్‌లో రుణాలు ఎంతమంది పొందారు.. ఎంతమంది రైతులకు మాఫీ వచ్చింది.. రాని వారు ఎంతమంది రైతులు ఉన్నారో అనే వివరాలు తెలుసుకున్నారు. బ్యాంక్ అకౌంట్, ఆధార్‌కార్డు, పట్టాపాసుబుక్‌లలో పొరపాటు ఉంటే వివరాలతో రుణమాఫీ కోసం వ్యవసాయ అధికారులకు దరఖాస్తులు అందించాలని తెలిపారు.

BOX OFFICE SHIVA THANDAVAME



సుదర్శన్ 35ఎంఎం - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
11.15,2.30,6.15,9.30
సంగీత 70 - ఆర్.సి.పురం 11.00,2.30,6.15,9.30
ఈశ్వర్ 70 - అత్తాపూర్ 11.00,2.30,6.00,9.15
శ్రీలక్ష్మి/ఇంద్ర 11.30,2.30,6.30,9.30
శివశక్తి 70ఎంఎం - కాప్రా 11.15,2.30,6.15,9.30
సాయిరాం - మల్కాజిగిరి 11.15,2.30,6.15,9.30

సెప్టెంబర్ 2న బ్రహ్మాండమైన విడుదల


దేవి 70ఎంఎం ఎ/సి - ఆర్.టి.సి.క్రాస్‌రోడ్స్
ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND
7.45,11.15,2.30,6.00,9.30
సంధ్య 35 - ఆర్.టి.సి.క్రాస్ రోడ్స్ 8.00,11.15,2.30,6.00,9.30
సంధ్య 70 - ఆర్.టి.సి.క్రాస్ రోడ్స్ 7.30,11.15,2.30,6.00,9.30
శాంతి 70 - నారాయణగూడ 7.30,2.00,6.00,9.15
సుదర్శన్ 35 - ఆర్.టి.సి.క్రాస్ రోడ్స్ 7.45am

వినాయక చవితి శుభాకాంక్షలతో
సెప్టెంబర్ 7న బ్రహ్మాండమైన విడుదల


దేవి 70ఎంఎం ఎ/సి - ఆర్.టి.సి.క్రాస్‌రోడ్స్
ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND
అర్జున్ 70ఎంఎం ఎ/సి - కూకట్‌పల్లి రాధాధాని డీలక్స్ ఎ/సి - దిల్‌సుఖ్‌నగర్

వినాయక చవితి శుభాకాంక్షలతో
సెప్టెంబర్ 6న బ్రహ్మాండమైన విడుదల


సంధ్య 35 - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
GLOBAL CINEMAS RELEASE

SUPER HIT నేడే చూడండి

ప్రసాద్ - ఎన్.టి.ఆర్ గార్డెన్స్ 9.00am
పంజాగుట్ట 11.05am
గలేరియా - పంజాగుట్ట 11.15am
జీవీకే - మదీనగూడ 11.00am
సినిమాస్ - బాలానగర్ 10.20am
మూవీటైమ్ - అమీర్‌పేట్ 3.30pm
GANESH BHARI - 9296509333



శాంతి 70ఎంఎం - నారాయణగూడ 11.00am
SHIVA SAI FILMS

SUPER HIT నేడే చూడండి


SAB CREATIONS THRO PRK FILMS 9154578901 / 8919077130



SHIVA SAI FILMS

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

● జిల్లా అదనపు కలెక్టర్ అంకిత్

ముప్కాల్, ఆగస్టు 30: అంతటా విషజ్వరాలు ప్రబలుతున్నాయని, సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని అదనపు కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం బాల్కొండ, ముప్కాల్ మండల కేంద్రంలో పర్యటించిన ఆయన ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాలను తనిఖీ చేశారు. సీజనల్ వ్యాధుల వ్యాప్తికి చేపట్టే చర్యలపై ఆరా తీశారు. నివాస ఇళ్లవద్ద నీరు నిల్వఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. చికెన్‌గున్యా, డెంగ్యూ, మలేరియా సోకకుండా ఫాగింగ్ చేయాలని సూచించారు. ఎలక్షన్ కమీషన్ ఆదేశాల మేరకు ముందస్తు చర్యల్లో భాగంగా బీఎల్‌వోల ఇంటింటి సర్వే చేస్తున్నారా అని పేర్కొన్నారు. ఓటర్‌లిస్టులో తప్పులు లేకుండా ఇంటింటికీ తిరిగి ఓటరు లిస్టు తయారుచేయాలని సూచించారు. అమ్మ ఆదర్శ స్కూళ్లను తనిఖీచేసి వారం రోజుల్లోగా మిగిలిఉన్న పనులను పూర్తిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయభాస్కర్, ముజారుద్దిన్, తహసీల్దార్ శ్రీధర్, శ్రీకాంత్, ఇన్‌చార్జీ కార్యదర్శులు, బీఎల్‌వోలు ఉన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ఆర్మూర్‌రూరల్: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఇంటి పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని గోవింద్‌పేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ మానస అన్నారు. శుక్రవారం ఫ్రైడే డ్రైడేలో భాగంగా పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాల్లో పాత కుండీలు, పనికి రాని వస్తువులు ఉండకుండా చూడాలని అన్నారు. వాటిలో వర్షపు నీరు పడి దోమలు లార్వ వృద్ధి చెంది మలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా, ఫైలేరియా వంటి వ్యాధులు ప్రభలుతాయన్నారు. దోమల వల్ల సోకే వ్యాధులపై, దోమల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు జక్కుల మోహన్, శ్యామల, ఎస్తేర్ రాణి, గణేష్, తదితరులు ఉన్నారు.

● వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

భీమ్‌గల్ రూరల్: గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రజలకు అవగాహన కల్పించాలని భీమ్‌గల్ ఎంపీడీవో సంతోష్ కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని దేవన్‌పల్లి గ్రామాన్ని ఆయన సందర్శించారు. గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల పథకంలో భాగంగా చేపడుతున్న పనులను పరిశీలించారు. అనంతరం గ్రామ పంచాయతీలో రికార్డులను తనిఖీచేశారు, నర్సరీని పరిశీలించారు. వనమహోత్సవ కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని, నాటిన మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో సూచించారు. కార్యక్రమంలో ఉపాధిహామీ సిబ్బంది, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

బోనుకు చిక్కిన 28 కోతులు !


బోనుకు చిక్కిన కోతులు ఇవే..

కమ్మర్‌పల్లి, ఆగస్టు 30: మండల కేంద్రంలో కొంతకాలంగా కోతులు ఇల్లు పీకి పందిరేయడంతోపాటు పలువురిని తీవ్రంగా గాయపరుస్తూ నష్టపర్చడం తో అటవీ అధికారులు, వీసీడీ సభ్యులు చేపట్టారు. స్థానిక అ టవీశాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన బోనులో సుమారు 28 కోతులు చిక్కాయి. అలాగే స్థానిక ఉన్నత పాఠశాలలోని చెట్లపై తిష్టవేసి విద్యార్థులను భయభ్రాంతుల కు గురిచేస్తున్న కోతులను పట్టేందుకు పాఠశాలలోనే ప్రత్యేక బోను ఏర్పాటు చేశారు. ఈ కోతులను పట్టేందుకు ఆంధ్రాకు చెందినవారితో ఒప్పందం చేసుకుని ప్రతీ కోతికి రూ.400, కోతులకు ఎరగా వేసేందుకు పుట్నాలు, పల్లీ లు, అరటిపండ్లు, భోజనసదుపాయాలను స్థానిక గ్రామాభివృద్ధి కమిటీ ఏర్పా టు చేస్తోంది. బోనులో చిక్కిన కోతులను సమీప అటవీ ప్రాంతాలలో కాకుండా ఇచ్చోడ అటవీ ప్రాంతంలోని కోతుసంరక్షణ కేంద్రానికి తరలించేందుకు ఒప్పందం చేసుకున్నారు. కొంతకాలంగా దాడులు చేస్తూ తీవ్రంగా గాయపరుస్తూ, ఆస్తులకు, పంటలకు నష్టం కలిగిస్తున్న కోతుల బెడద తీరనుండడంతో గ్రామ ప్రజలు పలువురు హర్షంవ్యక్తం చేస్తున్నారు.

ఆర్మూర్‌లో ఫ్రైడే డ్రైడే కార్యక్రమం

ఆర్మూర్‌టౌన్, ఆగస్టు30: పట్టణంలోని వివిధ కాలనీల్లో శుక్రవారం వైద్యశాఖ అధికారులు ఫ్రైడేడ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. అశోక్‌నగర్, రాంనగర్, శాస్త్రీనగర్, కమలానెహ్రూకాలనీ, జెమ్మన్‌జెట్టిగల్లీలో వైద్యసిబ్బందికి ఇంటింటికీ తిరుగుతూ వర్షపునీరు నిల్వ ఉండకుండా చూడాలని ప్రజలకు అవగాహన కల్పించారు. వర్షాకాలంలో కూలర్లు, పాతటైర్లు, కొబ్బరిచిప్పాలు, నీటికుండీలు, ఇతర పాడైన వస్తువులలో ఉండే నీటి నిల్వలను తొలగించాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ ఫిర్దోస్‌ఫాతిమ, సూపర్‌వైజర్ శాంత, హెల్త్ అసిఒస్టెంట్ ఆనంద్, బట్టు శ్యామల, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధమవ్వాలి

ఆర్మూర్‌రూరల్, ఆగస్టు30: రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు బీజేపీ కార్యకర్తలు సిద్ధం వావాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కలిగోట గంగాధర్ అన్నారు. ఆలూర్ మండల కేంద్రంలో శుక్రవారం బీజేపీ సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైఆయన మాట్లాడుతూ అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో కృషి చేసిన విధంగానే పార్టీ సభ్యత్వాన్ని విజయవంతం చేయాలన్నారు. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం ఆచారణకు సాధ్యంకానీ హామీలుఇచ్చి ప్రజలను మోసగిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్య క్షుడు గంగాధర్, ఆర్మూర్ అసెంబ్లీ సభ్యత్వ కన్వీనర్ గంగోని సంతోష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆలయ స్వాగత తోరణానికి భూమిపూజ

వేల్పూర్, ఆగస్టు 30: మండలంలో ముదిరాజ్‌లకు ఆరాధ్య దైవంగా నిలుస్తున్న పెద్దమ్మతల్లి ఆలయ స్వాగత తోరణానికి (కామన్)కు శుక్రవారం డీసీసీబీ చైర్మన్ కుంట రమేష్‌రెడ్డి భూమిపూజ చేశారు. వేల్పూర్ నుంచి పచ్చలనడ్కుడ వెళ్లే ప్రధాన రోడ్డు సమీపంలో పెద్దమ్మతల్లి ఆలయానికి వెళ్లే రోడ్డుకు స్వాగత తోరణ నిర్మాణానికి భూమిపూజ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం దేవాలయాల్లో భక్తులకు అన్నివిధాలా సౌకర్యాల ఏర్పాటుకు కృషి చేస్తోందని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ముదిరాజ్ సంఘం సభ్యులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత

ముప్కాల్, ఆగస్టు 30: బాల్కొండ మండల కేంద్రంలోని సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం లబ్ధిదారులకు కాంగ్రెస్ నాయకులు చెక్కులను అందజేశారు. బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కుమార్‌కు చొరవతో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు మంజూరు చేసినందుకు బాధితులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కోడిచర్ల రామకృష్ణ, శేక్ అఫ్సర్, కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

బేహరాన్‌లో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

కమ్మర్‌పల్లి, ఆగస్టు30: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు బేహరాన్‌లోని శ్రీకృష్ణ మందిరంలో శుక్రవారం ఘనంగ నిర్వహించారు. బేహరాన్‌లోని హిందూ కమిటీ, తెలుగు కళా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని మిరామీడ్ పద్దతిలో ఉట్టికోట్టే కార్యక్రమాన్ని నిర్వహంఇచారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు రెడ్డి ప్రసాద్, అరవింద్ బుద్దదేవ్ నర్సయ్య, కలాలిభానుచెందర్ పాల్గొన్నారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

ఎడపల్లి, ఆగస్టు 30: ప్రేమ విఫలమైందన్న కారణంతో పోచారం గ్రామంలో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్లు ఎడపల్లి ఎస్సై వంశీకృష్ణా రెడ్డి తెలిపారు. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎడపల్లి మండలం పోచారం గ్రామానికి చెందిన మోరె దీపక్ (20) తన ప్రేమ విఫలం కావడంతో కొంతకాలంగా మానసికంగా కుంగిపోయాడు. జీవితం మీద విరక్తి చెంది శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ఏరియా జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతుడి తల్లి మోరె లత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బాల్కొండలో అంతర్ పాఠశాలల క్రీడా పోటీలు

ముప్కాల్, ఆగస్టు 30: బాల్కొండ మండల కేంద్రంలో సెప్టెంబర్ 2వ తేదీ నుంచి 4 వరకు మూడు రోజుల పాటు ఉమ్మడి బాల్కొండ మండలంలోని అంతర్ పాఠశాల విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించనున్నట్టు ఎంఈవో బట్టు రాజేశ్వర్ తెలిపారు. చదువుతో పాటు క్రీడల్లో నైపుణ్యం పెంపొందించేందుకే క్రీడలు నిర్వహిస్తున్నామని, క్రీడల ప్రారంభోత్సవానికి బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి హాజరుకానున్నట్టు బాల్కొండ పాఠశాల యాజమాన్యం తెలిపింది.

రుణమాఫీ కాని రైతులు

కుటుంబ వివరాలిచ్చి సహకరించాలి


రైతుల కుటుంబ వివరాలు సేకరిస్తున్న అధికారులు


మాట్లాడుతున్న ఏడీఏ శ్రీనివాస రాజు

ఎడపల్లి, ఆగస్టు 30: రుణమాఫీ కాని రైతులు తమ కుటుంబ కుటుంబ వివరాలను నోడల్ అధికారికి వెల్లడించి సహకరించాలని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు మహమ్మద్ అబ్దుల్‌అలీం అహ్మద్ కోరారు. శుక్రవారం ఎడపల్లి మండలంలోని జైతాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో నోడల్, మండల వ్యవసాయ అధికారి సిద్ది రామేశ్వర్ కుటుంబ నిర్ధారణ లేని రైతుల కుటంబ వివరాలను సేకరించారు. కార్యక్రమాన్ని ఏడీఏ పరిశీలించి ఎంత మంది రైతులకు రుణమాఫీ కాలేదో వివరాలను నోడల్ అధికారిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల తమ కుటుంబ వివరాలను వెల్లడించి అధికారులకు సహకరించాలని అన్నారు. కార్యక్రమంలో వారితోపాటు పంచాయతీ కారోబార్ రహమత్, రైతు కృష్ణారావు తదితరులు ఉన్నారు.

కమ్మర్‌పల్లి: ఉప్లూర్ గ్రామంలోని రైతు వేదికలో నిర్వహించిన రైతుల కుటుంబాల నిర్ధారణ సర్వేను భీమ్‌గల్ ఏడీఏ శ్రీనివాస రాజు సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతుల ఆధార్‌కార్డులు, బ్యాంక్ అకౌంట్‌లపేర్లు పోలి లేనిం రైతులు తమ వివరాలను సెప్టెంబరు 7 లోగా సంబంధిత బ్యాంక్‌లకు వెళ్లి సరిచేయించుకోవాని, బ్యాంక్ వారికి లాగిన్ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జ్ ఏవో రమ్యశ్రీ, ఏఈవోలు జి రమేష్, సాయిరాంరాజు రైతుల వివరాలను సేకరించి నిర్ధారించారు. ఈ కార్యక్రమాలు నిర్ధారించిన తేదీల్లో జరుగుతాయని ఏవో రమ్యశ్రీ తెలిపారు. 31న కమ్మర్‌పల్లి, 2 సెప్టెంబరు హసాకొత్తూర్, 3న బషీరాబాద్, 4న అమీర్‌నగర్, 5న కోనాసముందర్, 6న నార్సాపూర్, 9న కోనాపూర్, కొత్తచెరువుతండా, 10న ఇనియత్ నగర్ డీసీ తండా, 11న చౌట్‌పల్లి, 12న బషీరాబాద్, 13 రాజరాజేశ్వరినగర్ (ఆర్ఆర్‌నగర్) గ్రామాలలో కుటంబ నిర్ధారణ కార్యక్రమాలు ఉంటాయని వెల్లడించారు.

ప్రజలను ఇబ్బందులకు గురిచేయొద్దు: ఆర్మూర్ ఎమ్మెల్యే


కార్యాలయాన్ని తనిఖీ చేస్తున్న ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి

ఆర్మూర్ రూరల్, ఆగస్టు 30: కమీషన్లు ఇవ్వాలంటూ మున్సిపల్ అధికారులు తమ వేధిస్తున్నారని పలువురి బాధితులు ఫిర్యాదు చేయడంపై ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి స్పందించి ప్రజలను ఇబ్బందులకు గురిచేయొద్దని అధికారులు హెచ్చరించారు. ఆర్మూర్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి తనిఖీ చేశారు. కార్యాలయంలో టౌన్ ప్లానింగ్, వివిధ విభాగాలను తనిఖీ చేశారు. మున్సిపల్ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులను కమిషనర్ రాజును అడిగి తెలుసుకున్నారు. కొందరు మున్సిపల్ అధికారులు కమీషన్ అడుగుతున్నారని వినాయక విగ్రహాల తయారీదారులు ఫిర్యాదు చేశారు. ఒక్కోషెడ్డుకు తైబజార్ రుసుము రూ.4వేలు చెల్లించినా మున్సిపల్ అధి కారులు రూ.30 వేలు చెల్లించాలని నోటీసులు ఇచ్చారని ఎమ్మెల్యేకు వివరించారు. దీంతో ఎమ్మెల్యే మున్సిపల్ కార్యాలయానికి వెళ్లి అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే సహించేదిలేదన్నారు. వినాయక విగ్రహాల తయారీకి ప్రభుత్వ స్థలాన్ని కేటాయిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఆయనవెంట బీజేపీ నాయకులు ఉన్నారు.

'బీడీ కార్మికులకు రూ.4వేల జీవనభృతి ఇవ్వాలి'

వేల్పూర్, ఆగస్టు30: ఎన్నికల సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించినట్టు ఎలాంటి ఆంక్షాలు లేకుండా బీడీ కార్మికులకు రూ. 4వేల జీవనభృతిని అమలుచేయాలని తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్రకార్యదర్శి ముత్తెన్న డిమాండ్‌చేశారు. శుక్రవారం వేల్పూర్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట యూనియన్ జిల్లానాయకుడు అర్వింద్ ఆధ్వర్యంలో బీడీ కార్మికులతో ధర్నా నిర్వహించారు. అంతకుముందు వేల్పూర్‌లో ప్రధాన రహదారిపై బీడీ కార్మికులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ముత్తెన్న మాట్లాడుతూ బీడీపరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులందరికీ చేయూత పథకం కింద రూ.4వేల ఇస్తామని రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని అమలుచేయాలని కోరారు. అనంతరం డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ సంతోష్‌కు అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రగతిశీల బీడీవర్కర్స్ యూనియన్‌జిల్లా ఉపాధ్యక్షురాలు సత్తెమ్మ, జిల్లానాయకులు కార్మికులు పాల్గొన్నారు.

ఓటుహక్కు నమోదుపై ఇంటింటి సర్వే

కోటగిరి, ఆగస్టు 30: పొతంగల్ మండలకేంద్రంలో ఓటుహక్కు నమోదుపై శుక్రవారం తహసీల్దార్ మల్లయ్య ఇంటింటి సర్వేను ప్రారంభించారు. అంగన్‌వాడీ టీచర్లు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలు సేకరించారు. గ్రామంలోని లేని వారివి, 18 ఏళ్లు నిండిన వారి వివరాలు సేకరించారు. ఓటరు జాబితాలో తప్పులు ఉంటే సవరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ సాయిలు, సిబ్బంది వెంకటేష్, బీఎల్‌వోలు, అంగన్‌వాడీ టీచర్‌లు పాల్గొన్నారు.

పాఠశాలలో సరస్వతి విగ్రహ ఆవిష్కరణ

జక్రాన్‌పల్లి, ఆగస్టు 30: మండలంలోని బాల్‌నగర్ పాఠశాలలో శుక్రవారం సరస్వతి విగ్రహాన్ని ఆవిష్కరించారు. బాల్‌నగర్ గ్రామానికి చెందిన కొమిరె రాజు సరస్వతి విగ్రహాన్ని ఏర్పాటుచేయగా ఉపాధ్యాయులు, గ్రామస్థులు కలిసి ఆవిష్కరించారు.

సుంకెట్‌లో పేకాటరాయుళ్ల అరెస్టు

మోర్తాడ్, ఆగస్టు 30: మండలంలోని సుకెట్‌లో పేకాడుతున్న స్థావరంపై దాడిచేసి 8మంది పేకాటరాయుళ్లను అరెస్టు చేశామని ఎస్సై విక్రమ్ తెలిపారు. శుక్రవారం రాత్రి మకు అందిన సమాచారం మేరకు పేకాటస్థావరంపై దాడిచేయశామని పేకాట అడుతున్న వారినుంచి రూ.12,170, 8 సెల్‌ఫోన్లు, కారు, రెండు బైక్‌లు స్వాధీనం చేసుకుకుని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఫ్రైడేను డ్రైడేగా పాటించాలి

ఎడపల్లి, ఆగస్టు30: ప్రతీ గ్రామ పంచాయతీలో ఫ్రైడేను డ్రైడేగా పాటించాలని ఇన్‌చార్జీ డీఎల్‌పీఓ మధుకర్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఎమ్మెస్సీ ఫారం గ్రామ పంచాయితీని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ శుక్రవారం డ్రైడేగా పాటిస్తూ సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, దోమల నివారణ కోసం మురుగుకాల్వలో, నాళాల్లో ఫాగింగ్ చేపట్టి ఆయిల్ బాల్స్‌ను వేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆయనతోపాటు మండల పంచాయతీ అధికారి మన్‌మోహన్ శర్మ, పంచాయతీ కార్యదర్శి రాజు, కారోబార్ కృష్ణ ఉన్నారు.



ఎమ్మెస్సీఫారం జీపీని పరిశీలిస్తున్న డీఎల్‌పీవో మధుకర్


సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ శ్రీనివాస్

వినాయక చవితి పండుగను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలి

● ఏసీపీ శ్రీనివాస్

రెంజల్/నవీపేట,ఆగస్టు 30: వినాయక చవితి పండుగను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని బోధన్ ఏసీపీ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండలంలోని సాటాపూర్ గ్రామంలోని రైతు వేదికలో ఎస్సై సాయన్న ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శాంతి కమిటీ సమావేశంలో పాల్గొని ఆయన మాట్లాడుతూ కుల, మతాలకు అతీతంగా ప్రజలందరూ సోదరభావంతో వినాయక చవితి పండుగను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలన్నారు. ఎటువంటి తారతమ్య భేదాలు లేకుండా కలిసికట్టుగా పండుగలు జరుపుకోవడంతో స్నేహభావం పెంపొందిందుతుందని, ప్రతీ పండుగను సోదరభావంతో జరుపుకుని ఒకరికొకరు స్నేహభావం పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రావణ్ కుమార్, ఎంపీడీవో శ్రీనివాస్, ఎస్సై సాయన్న, ట్రాన్స్‌కో ఏఈ రాజలింగం, పంచాయతీ కార్యదర్శి రాజేందర్‌రావు, వివిధ గ్రామాల నుంచి వచ్చిన మతపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తెలుగుభాష దినోత్సవం

బోధన్‌రూరల్, ఆగస్టు30: దేషభాషలందు తెలుగు లెస్సా అనేలా ఖండతరాలు దాటిన మన తెలుగు భాష మరువరాదని తెలుగు భాషలో ఉన్న మృదుత్వం, మాధుర్యం చాలా రమణీయమైనదని ఎందరో మహనుభావులు కవులుగా ప్రాచుర్యం పొందారని పంప సాహితీ పీఠం ప్రతినిధులు పురాణే అజయ్ కుమార్ అన్నారు. శుక్రవారం బోధన్ పట్టణంలోని ఇందూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో తెలుగు భాష దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పంప సాహితీపీఠం ప్రతినిదులు రాజేశ్వర్, కాట్రగడ్డ భారతి, 5వ జ్యుడిషియల్ జడ్జి శేషతల్ప సాయి, తదితరులు పాల్గొన్నారు.

మంత్రులను కలిసిన కాంట్రాక్టు అధ్యాపకులు

డిచ్‌పల్లి, ఆగస్టు30: తమను రెగ్యూలరైజ్ చేయాలని కోరుతూ టీయూ కాంట్రాక్టు అధ్యాపకులు శుక్రవారం హైదరాబాద్‌లో రాష్ట్ర మంత్రులు శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్సీ కోందడ రామ్‌లకు వినతిపత్రం అందజేశారు. త్వరలో తమ సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని, ఆ ఫైల్ సీఎం పేషీలో ఉందని మంత్రులు హా మీఇచ్చారని కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు డా.దత్త హరి తెలిపారు. మంత్రులను కలిసనవారిలో గంగాకిషన్, కిరణ్ రాథోడ్, రాజేశ్వర్, శ్రీనివాస్, నాగేశ్వరరావు, గోపి, కాకతీయ వర్సిటీ, ఓయూ, కాంట్రాక్టు అధ్యాపకులు పాల్గొన్నారు.


మంత్రి పొంగులేటికి వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

దేశ సుస్థిర అభివృద్ధికి

పునరుత్పాదక ఇంధన వనరులను కాపాడాలి


మాట్లాడుతున్న సైంటిస్ట్ చంద్రశేఖర్

డిచ్‌పల్లి, ఆగస్టు30: తెలంగాణ వర్సిటీలో శుక్రవారం తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో డా.సత్యనారాయణ అధ్యక్షతన జాతీయసైన్స్‌డే నిర్వహించారు. ఈ సందర్భంగా భారత రక్షణ శాఖ పరిశోధన, అభివృద్ధి సంస్థ డీఆర్‌డీవో నాగపూర్ సీనియర్ సైంటిస్ట్ చంద్రశేఖర్ సుస్థిర అభివృద్ధి పునరుత్పాదక వనరుల పాత్ర అనే అంశంపై కీలక ఉపన్యాసం చేశారు. సౌరశక్తి, పవన శక్తి, జల శక్తిలను కాపాడుకోవాలన్నారు. ప్రకృతికి హానిచేసే వ్యర్థాలను క్లోరో, ఫ్లోరో కార్బన్‌లు పొర దెబ్బతినడంతో అతినీలలోహిత కిరణాలు భూమికి చేరి మానవుల్లో క్యాన్సర్‌కు దారి తీస్తాయన్నారు. సెల్యూలోజ్ సహజ రసాయలను, హరిత రసాయనాలను పునరుత్పాదక వనరులను ఉపయోగించుకొని మానవ సుస్థిర అభివృద్ధికి పాల్పడాలన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ యాదగిరి మాట్లాడుతూ మానవ మనుగడకు శాస్త్రసాంకేతిక రంగాల్లో జరిగే నూతన ప్రయోగాలే దోహదం చేస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆరతి, నోడల్ ఆఫీసర్ ప్రొ.వాసంచంద్రశేఖర్, డా.ప్రసన్నశీల, డా.పున్నయ్య, అసిస్టెంట్ ప్రొఫెసర్‌లు డా.శరత్, నాగేంద్రబాబు, రామేశ్వర్ రెడ్డి అపర్ణ, నర్సయ్య, రమ్య, విద్యార్థులున్నారు.


భూమిపూజ నిర్వహిస్తున్న బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

వంతెన నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ

నవీపేట, ఆగస్టు30: మండల కేంద్రంలోని మోడల్ పాఠశాల సమీపంలోని అలీసాగర్ కాల్వపై రూ.12లక్షలతో నిర్మించే వంతెన నిర్మాణానికి శుక్రవారం బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మోడల్ పాఠశాల విద్యార్థులు, ఇందిరమ్మ కాలనీవాసులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతగా ఓ పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. అనంతరం పాలిటెక్నిక్ కళాశాలకు వెళ్లి విద్యార్థులు, ఉపాధ్యాయులతో ఎమ్మెల్యే మాట్లాడారు. కళాశాలలోని సమస్యలను పరిష్కరిస్తానని ఆయన హామీఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూఅకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, శ్రీనివాస్‌గౌడ్, రాజేందర్ గౌడ్, గోవర్ధన్ రెడ్డి, మోస్రా సాయిరెడ్డి, భగవాన్, చల్లా రవీందర్, సంజీవరెడ్డి, ఇరిగేషన్ డీఈ బలరాం, ఏఈ శ్రీధర్‌లు ఉన్నారు.

● పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలి

నవీపేట మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి పంచాయతీ కార్యదర్శి రవీందర్ నాయక్‌ను ఆదేశించారు. శుక్రవారం నవీపేట గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించారు. గ్రామంలో పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, వీధిలైట్ల ఏర్పాటు వంటి సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఆర్మూర్ మున్సిపల్ కమిషనర్ ఆకస్మిక తనిఖీ

● శుభ్రత పాటించని టిఫిన్ సెంటర్లకు జరిమానా

ఆర్మూర్‌టౌన్, ఆగస్టు30: పట్టణంలో పలు వార్డుల్లో మున్సిపల్ కమిషనర్ రాజు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. పలు వార్డుల్లో జరుగుతున్న పారిశుధ్య పనులతో పాటు టిఫిన్ సెంటర్‌లను కమిషనర్ రాజు పరిశీలించారు. శుభ్రత పాటించని టిఫిన్ సెంటర్‌లకు జరిమానా విధించారు. ఆయన వెంట మున్సిపల్ శానిటరీ ఇన్స్‌పెక్టర్ గజానంద్, పర్యవరణ ఇంజనీర్ పూర్ణమౌళి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఖిల్లా కట్టను రక్షించుకునే బాధ్యత అందరిది

● ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్

ముప్కాల్, ఆగస్టు 30: అల్లకొండ చరిత్ర చాలా గొప్పదని, రక్షించుకునే బాధ్యత ప్రతీఒక్కరిదని ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్ అన్నారు. శుక్రవారం బాల్కొండ మండలకేంద్రంలోని శాంభవి స్కూల్‌లో అల్లకొండ ఖిల్లా పూర్వచరిత్ర అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఆయన బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా బాల్కొండ ఖిల్లా అభివృద్ధి కోసం పురావస్తు శాఖ అధికారులతో సంప్రదించి మరమ్మత్తుల కోసం కలెక్టర్ సహాయంతో నివేదిక ఇస్తామన్నారు. ఖిల్లా గొప్పదనం తెలియజేసేలా విద్యార్థులకు పోటీలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో మోతె రామాగౌడ్, తహసీల్దార్ శ్రీధర్, శాంభవి స్కూల్ చైర్మన్ మధుసూదన్, రాజు, భూసం సత్యనారాయణ, సంతోష్, పవన్, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు దగ్ధం

● త్రుటిలో తప్పిన ప్రాణాపాయం

బోధన్‌రూరల్,ఆగస్టు 30: సాలూర మండలకేంద్రంలో శుక్రవారం రాత్రి 11 గంటల ప్రాంతంలో పొదగండి ఆనంద నివాసంలో ఒక్కసారిగా గ్యాస్ సిలిండర్ పేలింది. దీంతో ఇంట్లో ఉన్న ఇద్దరు కుటుంబ సభ్యులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఒక్కసారిగా గ్యాస్‌సిలిండర్ పేలడంతో కాలనీవాసులు భయాందోళనకు గురైచెలరేగుతున్న మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. గ్యాస్ సిలిండర్ పేలడంతో ఇంట్లోని సామగ్రి కాలిపోగా త్రుటిలో ప్రాణనష్టం తప్పింది. గాయపడ్డ ఇద్దరిని బోధన్ ఆసుపత్రికి తరలించారు.

టీయూలో జాబ్ మేళా

డిచ్‌పల్లి, ఆగస్టు 30: తెలంగాణ విశ్వవిద్యాలయం రసాయన శాస్త్ర విభాగంలో విభాగాధిపతి డా.అడికే నాగరాజు పర్యవేక్షణలో హైదరాబాద్‌లోని హెటిరో డ్రగ్స్ కంపనీ ప్రతినిధులు దుర్గాప్రసాద్, రంగారెడ్డిలు 2022-2024 బ్యాచ్ విద్యార్థులకు జాబ్‌మేళా నిర్వహించారు. ఈ మేళాలో కాకతీయ వర్సిటీ, ఉస్మానియా, జేఎన్‌టీయూ, మహారాష్ట్ర, కేరళ వర్సిటీలకు చెందిన 120 మంది విద్యార్థులు జాబ్‌మేళాలో పాల్గొన్నట్లు నాగరాజు తెలిపారు. హెటిరో డ్రగ్స్ కంపనీ నిర్వహించిన రాత పరీక్ష, మౌఖిక పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన 35మంది విద్యార్థులకు రిజిస్ట్రార్ యాదగిరి, ప్లేస్‌మెంట్ డైరెక్టర్ పాతనాగరాజు నియామకపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆరతి, డా.సాయిలు, డా.బాలకిసన్, నాగేశ్వరరావు, రాజేశ్వరి, గంగా కిషన్, డెనియల్, సురేశ్, నాగేంద్రబాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

'పెండింగ్ ఉన్న ఫీజురీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలి'

బోధన్‌రూరల్, ఆగస్టు30: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య మండలసమితి నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని పీఆర్‌టీయూ భవన్‌లో శుక్రవారం అఖిల భారత విద్యార్థి సమాఖ్య మండలసమితి ఆధ్వర్యంలోసమావేశం నిర్వహించారు. డివిజన్ ఇన్‌చార్జి అంజలి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రఘురామ్ మాట్లాడారు. ఫీజురీయింబర్స్‌మెంట్ రాక విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. సంక్షేమ హాస్టళ్లలో చదివే విద్యార్థులకు మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కార్తీక్, శివాజీ, తరుణ్, అర్చన, సాయిసుప్రియ, రజని, జీవన్, తదితరులు ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

జక్రాన్‌పల్లి, ఆగస్టు30: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు శుక్రవారం నిజామాబాద్‌రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి పంపిణీ చేశారు. జక్రాన్‌పల్లి గ్రామానికి చెందిన 17మంది లబ్ధిదారులకు రూ.7లక్షల 45వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. అలాగే తొర్లికొండ గ్రామానికి చెందిన లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీచేశారు. కార్యక్రమంలో మాజీ వైస్‌ఎంపీపీ జితేందర్‌నాయక్, మాజీసర్పంచ్ కాట్‌పల్లి నర్సారెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి వసంత్‌రావు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'అంగన్‌వాడీ కేంద్రంలోని ఆయాను మార్చండి'

బీర్కూర్, ఆగస్టు 30: మండలకేంద్రంలోని 1వ నెంబర్ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుల తల్లిదండ్రులు, గర్భిణీలు, బాలింతలు శుక్రవారం ఆందోళనకు దిగారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుమలత అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చిన విషయం తెలుసుకున్న పిల్లల తల్లిదండ్రులు, గర్భిణీలు, బాలింతలు అక్కడికి చేరుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చిన పిల్లలను ఆయా ఇష్టారీతిన కొడుతోందని, గర్భిణులు, బాలింతల పట్ల దురుసుగా ప్రవర్తిస్తుందని, కుల వివక్ష చూపుతోందని సూపర్‌వైజర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై సూపర్‌వైజర్‌కు తల్లిదండ్రులు, గర్భిణులు, బాలింతలకు వాగ్వాదం చోటుచేసుకుంది. ఆయాను ఆమెను వేరే కేంద్రానికి మార్చాలని డిమాండ్‌చేశారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని సూపర్‌వైజర్ హామీని ఇవ్వడంతో గొడవ సద్దుమణిగింది.


సూపర్‌వైజర్‌తో మాట్లాడుతున్న పిల్లల తల్లిదండ్రులు

అనుమానాస్పద స్థితిలో నర్సు మృతి

- ప్రేమికుడే ప్రశాంత్ హత్య చేశాడని కుటుంబ సభ్యుల ఆరోపణ
- చర్యలు తీసుకోవాలని పోలీసు స్టేషన్ ఎదుట ఆందోళన

బాన్సువాడ, ఆగస్టు 30: బాన్సువాడలో పని చేస్తున్న ఓ నర్సు శుక్రవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన కలకలం రేపింది. ప్రేమికుడే హత్య చేశాడని యువతి కుటుంబీకులు ఆందోళనకు దిగడంతో.. స్థానికంగా ఉద్రిక్తత నెలకొంది. మృతురాలి కుటుంబీకుల కథనం ప్రకారం.. జిల్లాలోని బీర్కూర్ మండలం బరంగేడ్గి గ్రామానికి చెందిన మమత(23) బాన్సువాడలోని చైతన్యకాలనీలో నివాసం ఉంటోంది. పట్టణంలోని సెవెన్ హిల్స్ మల్టీ స్పెషాలిటీ ప్రైవేట్ ఆసుపత్రిలో నర్సుగా పని చేస్తోంది. బాన్సువాడకు చెందిన ప్రశాంత్ అనే యువకుడితో మమత గత కొన్నేళ్లుగా ప్రేమలో ఉంది. అయితే శుక్రవారం మమత ఆరోగ్యం సరిగ్గా లేదంటూ ప్రశాంత్ ఆమెను బాన్సువాడ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేర్పించాడు. ఎవరికీ అనుమానం రాకుండా ఆమె తన కుటుంబసభ్యురాలు అని వైద్యులను నమ్మించాడు. దీంతో వైద్యులు మమతను పరీక్షించగా.. అప్పటికే మృతి చెందిందని తెలపడంతో.. ప్రశాంత్ గుట్టుగా అక్కడి నుంచి పరారయ్యాడు. ఆస్పత్రి సిబ్బంది ద్వారా ఈ విషయం తెలుసుకున్న మమత తల్లిదండ్రులు, కుటుంబీకులు వెంటనే బాన్సువాడకు చేరుకున్నారు. తన కూతురు మమతను ప్రేమికుడు ప్రశాంత్ హత్య చేశాడని ఆరోపించారు. మమతను హత్య చేసి.. ఏమి తెలియనట్టు ఆస్పత్రిలో చేర్పించాడని తెలిపారు. వెంటనే అతన్ని అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా చేశారు. అలాగే మమత పని చేసిన సెవెల్ హిల్స్ ఆసుపత్రి నిర్వాహకులపైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయం తెలుసుకున్న బాన్సువాడ సీఐ కృష్ణ ఘటనా స్థలికి చేరుకొని బాధితులను సముదాయించారు. ప్రశాంత్ ప్రస్తుతం పరారీలో ఉన్నాడని, వీలైనంత త్వరగా అతన్ని పట్టుకుంటామని సీఐ హామీ ఇవ్వడంతో.. మృతురాలి కుటుంబీకులు ఆందోళన విరమించారు.


పోలీస్‌స్టేషన్ ముందు రాస్తారోకో చేస్తున్న మృతురాలి కుటుంబ సభ్యులు, గ్రామస్థులు, (ఇన్‌సెట్‌లో మమత)


కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

విద్యార్థులకు కంటి పరీక్షలు

మద్నూర్, ఆగస్టు 30 : ఉమ్మడి మద్నూర్ మండలంలోని ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో కంటి పరీక్షలను నిర్వహించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఉర్దూ పాఠశాలలో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి జాగ్రత్తలను సూచించారు. అనంతరం వైద్యుడు నాగరాజు మాట్లాడుతూ జీవితం సాఫీగా సాగాలంటే కంటి చూపు ఎంతో అవసరమన్నారు. ప్రతిరోజూ కళ్లను శుభ్రంగా కడుక్కోవాలని వాటిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత మనపై ఉంటుందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్లేశం, ఉపాధ్యాయుడు షాహీన్ బేగం, శివకాంత్, నవీద్, వైద్య సిబ్బంది, శ్యామల తదితరులు పాల్గొన్నారు.


మైలారంలో అంగన్‌వాడీ సెంటర్‌ను తనిఖీ చేస్తున్న దయానంద్

విద్యార్థుల పట్ల అశ్రద్ధ వహిస్తే చర్యలు తప్పవు

- మండల ప్రత్యేక అధికారి దయానంద్

నసురుల్లాబాద్, ఆగస్టు 30: అంగన్‌వాడీ సెంటర్‌లోని అంగన్‌వాడీ టీచర్లు విద్యార్థుల పట్ల అశ్రద్ధ వహిస్తే కఠిన చర్యలు తప్పవని మండల ప్రత్యేక అధికారి దయానంద్ అన్నారు. శుక్రవారం నసురుల్లాబాద్ మండలంలోని నెమలి, మైలారం గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. అంగన్‌వాడీలోని రిజిష్టర్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చిన్నారులు, గర్భిణులు, బాలింతలు కేంద్రాలకు తప్పకుండా వచ్చేలా చూడాలని అంగన్‌వాడీ టీచర్లను ఆదేశించారు. అదే విధంగా గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారాన్ని అందజేయాలన్నారు. విద్యార్థుల పట్ల అశ్రద్ధ వహిస్తేకఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. మండల ప్రత్యేక అధికారి వెంట ఎంపీవో సూర్యకాంత్, ఉపాధి హామీ ఏపీవో సౌజన్య, టెక్నికల్ అసిస్టెంట్ బలరాం, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు ఉన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టండి

- ఎంపీవో సూర్యకాంత్

నసురుల్లాబాద్, ఆగస్టు 30: ప్రస్తుతం మండలంలోని ఆయా గ్రామాల్లో సీజనల్ వ్యాధులు వ్యాపిస్తున్న తరుణంలో పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీవో సూర్యకాంత్ అన్నారు. శుక్రవారం నసురుల్లాబాద్ మండలంలోని మండల అభివృద్ధి కార్యాలయంలో ఎంపీవో సూర్యకాంత్ పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఎలాంటి చర్యలు చేపట్టాలో పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పించారు. ఈ సమీక్ష సమావేశంలో ఏపీవో సౌజన్య, టెక్నికల్ అసిస్టెంట్లు, మండలంలోని ఆయా పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

దోమకొండ: ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మెడికల్ ఆఫీసర్ భానుప్రియ, ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని సంగమేశ్వర్ గ్రామంలో హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనారోగ్యం పాలయితే వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి చికిత్స తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వసంత, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పీఎంపీ, ఆర్‌ఎంపీ క్లీనిక్‌లలో ప్రాథమిక చికిత్స చేయాలి

మద్నూర్, ఆగస్టు 30: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామీణ ప్రాంతాల్లో ఆర్‌ఎంపీ, పీఎంపీల ఆధ్వర్యంలో నడిపిస్తున్న ప్రైవేట్ ఆసుపత్రులను డోంగ్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు శ్రీలేఖ తనిఖీ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని పలు ప్రైవేట్ ఆసుపత్రులను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు గ్రామీణ ప్రాంతాల్లో ఆర్‌ఎంపీ, పీఎంపీలు నడిపిస్తున్న ఆసుపత్రుల్లో ప్రాథమిక చికిత్స మాత్రమే చేయాలని సూచించారు. ఇంజక్షన్లు ఇవ్వరాదని, ఫ్లూయిడ్స్ పెట్టరాదని తెలిపారు. హయ్యర్ యాంటి బయోటిక్స్ ఐవీ ఫ్లూయిడ్ ఉపయోగించరాదని సూచనలు చేశారు. ప్రథమ చికిత్స కేంద్రాల్లో బెడ్లు ఏర్పాటు చేయరాదని అన్నారు. ఆమెతో పాటు ఎంపీడీవో రాణి, వైద్యులు నాగరాజు, ఎంఎల్‌హెచ్‌పీ బస్వరాజ్, గ్రామ పంచాయతీ కార్యదర్శి సందీప్ తదితరులు పాల్గొన్నారు.

బీర్కూర్: కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం బీర్కూర్ మండల కేంద్రంలోని పీఎంపీ, ఆర్‌ఎంపీ క్లీనిక్‌లను మండల వైద్యాధికారి గిరీష్, ఎంపీవో మైబూబ్‌లు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీఎంపీ, ఆర్‌ఎంపీ వైద్యులు తమ క్లినిక్‌లకు వచ్చే రోగులకు యాంటిబైటిక్‌లు ఇవ్వకూడదని, సెలైన్‌లు పెట్టకూడదని అన్నారు. క్లినిక్‌లలో బెడ్‌లు గాని, ల్యాబ్‌లు కాని, మందులు కాని పెట్టవద్దని ఆదేశించారు. వారి వెంట ఆరోగ్య సిబ్బంది ఆశా వర్కర్లు ఉన్నారు.


బీర్కూర్‌లో ప్రైవేట్ క్లీనిక్‌లను తనిఖీ చేస్తున్న డాక్టర్ గిరీష్

మూలమలుపే ప్రాణం తీసింది

- బొలెరో, ఆటో ఢీ ఒకరి మృతి

నసురుల్లాబాద్, ఆగస్టు 30: మండల కేంద్రంలోని నిజాంసాగర్ ప్రధాన కాలువ మూలమలుపు వద్ద శుక్రవారం ఎదురెదురుగా వస్తున్న బొలెరో వాహనం, ఆటో ఢీకొని ఒకరు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాందేడ్‌కు చెందిన కొంత మంది కుటుంబ సభ్యులతో కలిసి బాన్సువాడలో శుభకార్యానికి వస్తుండగా, బాన్సువాడ నుంచి వర్ని వైపు వెళుతున్న బొలెరో వాహనం మూల మలుపు వద్ద ఆటోను ఢీకొట్టింది. దీంతో నాందేడ్ గ్రామానికి చెందిన ఉష అక్కడికి అక్కడే మృతి చెందింది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని గాయపడిన వారిని 108లో బాన్సువాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఏఎస్ఐ వెంకట్రావ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసు

పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేయాలి

- ప్రోగ్రెసివ్ పెన్షనర్స్ ఫెడరేషన్ సభ్యులు

కామారెడ్డి టౌన్, ఆగస్టు 30: రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిన నాలుగు డీఏలను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ పెన్షనర్స్ ఫెడరేషన్ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా టీపీపీఎఫ్ జిల్లా కన్వీనర్ సంగమేశ్వర్, కో కన్వీనర్ పి.అంజయ్యలు మాట్లాడుతూ ఇప్పటి వరకు నాలుగు డీఏలు రెండు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్నాయని, ధరల సూచిక ఆధారంగా ఇవ్వాల్సిన డీఏలు ఇవ్వకపోవడం అన్యాయమని దీని మూలంగా రిటైర్డ్ ఉద్యోగులు ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. అదేవిధంగా పీఆర్‌సీ కమిటీని వెంటనే రిపోర్టు విడుదల చేసేలా 30 శాతం ఫిట్‌మెంట్‌తో చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని, కామారెడ్డి జిల్లా కేంద్రంలో పెన్షనర్ల కోసం వెల్‌నెస్ సెంటర్‌ను అన్ని వసతులతో ఏర్పాటు చేయాలని, పెన్షనర్లకు కమ్యూటేషన్ విలువ తిరిగి చెల్లించే కాలాన్ని 15 సంవత్సరాల నుండి 12 సంవత్సరాలకు కుదించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న సీఐ చంద్రశేఖర్‌రెడ్డి

వ్యాపారి హత్య కేసులో నలుగురి అరెస్టు

కామారెడ్డి టౌన్, ఆగస్టు 30: కామారెడ్డి పట్టణంలోని విద్యానగర్‌లో పాత విశ్వనాథంపై దాడి చేసి అతను చనిపోయేందుకు కారణమైన నలుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. విశ్వనాథం ఆలయానికి వెళ్తుండగా అడ్డగించి దాడి చేసిన లక్ష్మీభాయి, ఆమె అల్లుడు రాజశేఖర్, పోచయ్య, శంకరప్పలను అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరుపరిచడంతో న్యాయమూర్తి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి

కామారెడ్డి టౌన్, ఆగస్టు 30: ప్రజల సౌకర్యార్థం కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి ఏర్పాటు చేసిన ఫిర్యాదుల పెట్టెలో వచ్చిన ప్రజాసమస్యల దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని ఎంపీడీఓ, ఎంఆర్‌ఓకు దరఖాస్తులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండాలనే ఉద్దేశ్యంతో నియోజకవర్గంలోని అన్ని గ్రామాల, పట్టణంలో ఫిర్యాదుల పెట్టెలను ఏర్పాటు చేశారని వాటిలో వచ్చిన ఫిర్యాదులను సంబంధిత అధికారులకు సిఫారస్ చేసి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి మండల అధ్యక్షుడు శ్రీధర్, నాయకులు రవి, రాజలింగం, భూపతి, బాలు, భాస్కర్, ప్రసాద్, విఠల్ తదితరులు పాల్గొన్నారు.


అధికారులకు వినతి పత్రం అందిస్తున్న నాయకులు

సమయ పాలన పాటించని ఉపాధ్యాయుడికి మెమో

నాగిరెడ్డిపేట, ఆగస్టు 30: సమయపాలన పాటించని ఓ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడికి శుక్రవారం మెమో జారీ చేసినట్లు మండల విద్యాధికారి వెంకటేశం తెలిపారు. మండలంలోని రాఘవపల్లి తండా ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు గురువారం సెలవుపై వెళ్లగా మండలంలోని లింగంపల్లి కలాన్ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు రియాజ్‌ను ఒక రోజు కోసం రాఘవపల్లి తండా ప్రాథమిక పాఠశాలకు డిప్యూటేషన్ వేసినట్లు తెలిపారు. అతను గురువారం ఉదయం 10 గంటల వరకు పాఠశాలకు రాకపోవడంతో విషయం తెలుసుకుని శుక్రవారం కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు వెంకట్రామిరెడ్డితో కలిసి తాము రాఘవపల్లి తండా పాఠశాలను తనిఖీ చేసినట్లు తెలిపారు. గురువారం సమయపాలన పాటించని ఉపాధ్యాయుడికి మెమో జారీ చేసినట్లు ఆయన తెలిపారు. మండల ఉపాధ్యాయులందరూ సమయపాలన పాటించాలని, ఎవరైనా సమయ పాలన పాటించకపోతే వారిపైన కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.


అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

కలుపు మొక్కను ఆదిలోనే నిర్మూలించాలి

సదాశివనగర్, ఆగస్టు 30: వయ్యారిభామ కలుపు మొక్కను ఆదిలోనే నిర్మూలించకపోతే అనారోగ్యాల బారిన పడవేస్తుందని రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ కళాశాల విద్యార్థులు రైతులకు తెలిపారు. మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు సదాశివనగర్‌లో క్షేత్రప్రదర్శన చేసి వయ్యారిభామ వల్ల కలిగే హానీలు దాని నివారించడంపై రైతులకు అవగాహన కల్పించారు. విత్తనాల్లో ఇతర దేశాల నుంచి మన దేశానికి వచ్చిన వయ్యారిభామ అనతికాలంలోనే అన్ని గ్రామాలకు వ్యాపించి ప్రజలను అనారోగ్యానికి గురి చేస్తుందన్నారు. పూత దశకు రాకముందే మొక్కను పీకి వేయడమే ఏకైక మార్గమని తెలిపారు. పూత వచ్చిన తర్వాత తొలగించినా అప్పటికే విత్తనం భూమిలో కలిసిపోయి మరింత వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున మొక్క దశలోనే కలుపుతీయడం మొక్కలు తొలగించడం లాంటి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు అభినవ్య, అర్పణ, శ్రీజ, సిరిచందన, సింగిల్‌విండో చైర్మన్ కమలాకర్‌రావు, వ్యవసాయ విస్తీర్ణాధికారులు శ్రీనివాస్‌నాయక్, కవిత, రైతులు మల్లయ్య, బాబాయ్య తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వాన్ని ప్రతీ గ్రామంలో చేపట్టాలి

ఎల్లారెడ్డి, ఆగస్టు 30: బీజేపీ సభ్యత్వాన్ని ప్రతీ గ్రామంలో చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రవీంద్రరావు అన్నారు. శుక్రవారం ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని రామాలయం టెంపుల్‌లో బీజేపీ కార్యకర్తలతో సభ్యత్వ నమోదుపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ సభ్యత్వం పెంచాలని సెప్టెంబరు 17న తెలంగాణ విమోచన దినోత్సవం జరపడం, అదే రోజు భారత ప్రధాని నరేంద్రమోది పుట్టిన రోజు వేడుకలు జరుపుకోవాలని స్థానిక సంస్థల ఎన్నికలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు మర్రి బాలకిషన్, బీజేపీ మండల అధ్యక్షుడు నర్సింలు, ప్రధాన కార్యదర్శి నరేష్, పీకే సీనియర్ నాయకులు సాయిరెడ్డి, నరసింహారెడ్డి, గణేష్, శ్రీనివాస్, సాయిలు, వివిధ గ్రామాల అధ్యక్షులు పాల్గొన్నారు.


బోరు మోటార్‌ను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్

బోరు మోటార్ ప్రారంభం

కామారెడ్డి టౌన్, ఆగస్టు 30: కామారెడ్డి పట్టణంలోని 16వ వార్డులో మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ బోరు మోటార్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు నీటి సమస్య తీర్చేందుకు బోర్లు వేయిస్తున్నామని తెలిపారు. కొన్ని వార్డుల్లో తీవ్ర నీటి సమస్య ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని కౌన్సిలర్‌లు సూచించడంతో ఇబ్బంది ఉన్న చోట బోర్లు వేయిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ చాట్ల వంశీకృష్ణ, పంపరి లత, పిడుగు మమత తదితరులు పాల్గొన్నారు.


దేవునిపల్లిలో పర్యటిస్తున్న ఆర్డీవో మన్నె ప్రభాకర్

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

- ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నె ప్రభాకర్

ఎల్లారెడ్డి, ఆగస్టు 30: పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నె ప్రభాకర్ అన్నారు. శుక్రవారం ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో దేవునిపల్లి ప్రాంతంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మురికి కాలువలు శుభ్రంగా ఉండాలని, రోడ్లపై గుంతలపై నీటి నిలువ లేకుండా ఉండాలని, రోడ్లపై గుంతలపై నీటి నిలువ లేకుండా చూడాలని మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజుకు తెలిపారు.

నాగిరెడ్డిపేట మండల ప్రత్యేక అధికారిగా లక్ష్మీప్రసన్న

నాగిరెడ్డిపేట, ఆగస్టు 30: మండల ప్రత్యేక అధికారిగా ఎల్లారెడ్డి ఏడీఏ లక్ష్మీ ప్రసన్న శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇది వరకు నాగిరెడ్డిపేట మండల ప్రత్యేక అధికారిగా పని చేసిన మాల్తుమ్మెద విత్తన క్షేత్రం ఏడీఏ వీరస్వామి బదిలీపై వెళ్లడంతో నాగిరెడ్డిపేట మ ండల ప్రత్యేక అధికారి పదవీ ఖాళీ అయింది. దీంతో ఎల్లారెడ్డి ఏడీఏ లక్ష్మీ ప్రసన్నను నాగిరెడ్డి పేట మండల ప్రత్యేక అధికారిగా జిల్లా ఉన్నతాధికారులు నియమిం చడంతో ఆమె బాధ్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రభా కర్‌చారి, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.


బాధ్యతలు స్వీకరిస్తున్న లక్ష్మీ ప్రసన్న

ఆగ్రహారం పోచమ్మకు బోనాల సమర్పణ

దోమకొండ, ఆగస్టు 30: మండల కేంద్రంలోని అగ్రహారం పోచమ్మ అమ్మవారికి శుక్రవారం దేవాలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో బోనాలు సమర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ శ్రావణమాసం చివరి శుక్రవారం సందర్భంగా ప్రతి సంవత్సరంలాగే కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షులు పున్న రాములు, ఉపాధ్యక్షులు అవదూత సహదేవ్, ప్రధాన కార్యదర్శి కర్రోల్ల శ్యామ్‌గౌడ్, కార్యదర్శి ఎండపల్లి గంగారాములు, కోశాధికారి అబ్రబోయిన రాజు తదితరులు పాల్గొన్నారు.


పోచమ్మకు బోనాలు తీసుకెళ్తున్న మహిళలు



సదా మీ సేవలో...

పత్రిక సరఫరాలో మీకు ఏమైనా ఇబ్బందులు ఉన్న యెడల ఈ దిగువ పేర్కొన్న ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు..

కామారెడ్డి - ఎల్లారెడ్డి
90322 16482

అసిస్టెంట్ సర్కులేషన్ మేనేజర్: 99854 11454
బ్రాంచ్ మేనేజర్ సెల్: 99854 11451

CLASSIFIEDS

WANTED

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలను ప్రచురించడానికి ముందు తగిన రీతిలో నిజానిజాలు ధృవీకరించుకోవలసిందిగా పాఠకులను సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపుబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

Classifieds
మీ అభిమాన ఆంధ్రజ్యోతి
దినపత్రిక కల్పిస్తోంది ఒక చక్కటి అవకాశం
ప్రతి రోజు...
క్లాసిఫైడ్స్

-: సంప్రదించవలసిన నెంబరు :-
కామారెడ్డి : 9985411453

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

శాంతి	సరిపోదా శనివారం
దర్శన్	కమిటీ కుర్రాళ్లు
ప్రియా 70	ఆయ్
ప్రియా 35	ఆహో విక్రమార్క

బాన్సువాడ

మహేశ్వరి	సరిపోదా శనివారం
వెంకటేశ్వర	తంగలాన్

చికెన్ ధరలు



రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	120	150	180
వెన్‌కాబ్(కిలో)	130	160	190

